# ఎదురు చూడని ఉత్తరం

లక్ష్మణ సుధాకర్

ఉదయం పదకొండు గంటలు కావస్తూంది. ఎండ తీక్షణమౌతూంది. పోస్ట్‌మేన్ వచ్చే సమయం. వీధిలో కెళ్లి చూశాను. అల్లంత దూరాన వీధి మలుపులో పోస్ట్‌మేన్ రాములు కనిపించాడు... రాముల్ని చూడగానే గుండె వేగంగా కొట్టుకోవటం మొదలెట్టింది. యెందుకనో...? రోజూ వచ్చే పోస్ట్‌మేనే అయినా వాడు మా ఇల్లు దాటి వెళ్లి పోయేదాకా నా గుండె స్పీడ్‌గా కొట్టుకుంటుంది. ఎక్కువగా సస్పెన్సు కలిగితే యిలా వుంటుందేమో! ఈ రోజూ అంతే జరుగుతూంది. అసలు నాలుగు రోజుల్లై ఒక్కసారి మా గుమ్మం తొక్కిన పాపాన పోలేదు వాడు. రోజూ "ఉత్తరాలేం రాలేదు — ఇవ్వాళ కూడా" అని అంటూంటే నాన్నగారు నవ్వుతూ "రోజూ యెక్కడ్నించి వస్తాయిరా... పోనీ అంత ఇదిగా వుంటే నీకు నువ్వే రాసేసుకుని రోజుకో వుత్తరం పోస్ట్ చేసేసుకో" ఓ పాత చమత్కారం పారేస్తారు.

అరడజను వుద్యోగాలకి అప్లికేషన్లు పెట్టాను... ఒక్క దగ్గర్నించీ జవాబు రాలేదు. ఇంటర్వ్యూకి పిలవకపోతే మానె. కనీసం 'రిగ్రెట్ లెటర్' ముక్క కూడా వ్రాయరు. వీళ్ల సొమ్మేం పోయిందో! అప్లికేషన్ ఫీజు అని పోస్టల్ ఆర్డర్లు మాత్రం ఖచితంగా పుచ్చుకుంటారు. ఓ పది పైసల రిగ్రెట్ కార్డు పారేస్తే యేం నష్టమో!


ఆ ఆంధ్రా బ్యాంక్ నుంచి ఇంటర్వ్యూ పిలుపు రావాలి. నా అర్హతలు వాళ్లు అడిగిన దానికంటె యెక్కువే... ఈ రోజు వస్తుందేమో ఉత్తరం... వెధవది ఈసారైనా ఇంటర్వ్యూ బాగా చెయ్యాలి. యిప్పటికి ఏడుసార్లు ఇంటర్వ్యూ కెళ్లాను. "విసుగు చెందని విక్రమార్కుడు" అంటాడు తాతయ్య. వాళ్లకేం తెలుస్తుంది నాబోటివాళ్ల పరిస్థితి. యెప్పుడో వాళ్ల రోజులు గుర్తు చేసుకుని వాపోవటం తప్ప. అసలు ఈ ఇంటర్వ్యూలు పూర్వం యిలా వుండేవా? యేదో తప్పనిసరి అయితే తప్ప ఉద్యోగాలకి వెళ్లి యెరుగరు వాళ్లు. అథవా వెళ్లినా యీ కాంపిటీషన్లు అవీ ఉండేవి కావు. గ్రాడ్యుయేట్ అంటే ఓ జీనియస్ క్రింద లెక్క ఆ రోజుల్లో. ఇప్పుడో—? ఆ మధ్య యెక్కడో చదివినట్లు గుర్తు— బస్ కండక్టర్ల మినిమమ్ క్వాలిఫికేషన్ గ్రాడ్యుయేషన్ చేసేస్తారుట ఢిల్లీలోనో యెక్కడో...! ఆహా... హతవిధీ... యేం రోజులు వచ్చిపడ్డాయి!

క్రిందటిసారి ఆ మెడికల్ రిప్రజెంటేటివ్ వుద్యోగానికి విజయవాడ వెళ్తే అక్కడ ఇంటర్వ్యూలో "మిస్టర్ నువ్వు ఎమ్మెస్సీ ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయ్యావుకదా... యే లెక్చరర్‌గానో అయేందుకు ట్రై చెయ్యక ఇదెందుకు నీకు — ఎక్స్‌క్యూజ్ మీ... యూ ఆర్ ఓవర్ క్వాలిఫైడ్ ఫర్ దిస్ పోస్ట్" అన్నాడా రీజనల్ మేనేజర్! యేమంటాను నేను!

యేవీ లెక్చరర్ వుద్యోగాలు? దొరికితే నాకూ బాగానే వుంటుంది. ఇప్పటికి నాలుగు చోట్ల కెళ్లాను. ఇరవై ముప్ఫయి మందిని ఇంటర్వ్యూకి పిలవటం, చివరికి వాళ్లకు ముందే యెవరో కేండిడేట్ వుండటమో, లేకపోతె యే ఎక్స్‌పీరియెన్స్‌డ్ ఫెలో దొరకటమో జరుగుతూంది. అంతా ఐ వాష్! కొన్ని వుద్యోగాలకి ఓవర్ క్వాలిఫైడ్, కొన్నింటికి అండర్ క్వాలిఫైడ్... ఇక ఈ అర్హతలు సరిపోయే దెక్కడ?

ఆలోచనల్లోంచి తేరుకుని రోడ్ మీదకు చూసేసరికి రాములు మా యింటికి నాలుగిళ్ల అవతల వున్న సందులోకి దూరుతున్నాడు... ఇడియట్... వీడూ వూరిస్తున్నాడు... సుజాతలా... సుజాత... అవును... సుజాత యింతే... ప్రతీ మాటకూ వూరించి వూరించి సస్పెన్సులో పెట్టి... చివరికి తేలుస్తుంది. సుజాత... యెంత అందంగా నవ్వుతుంది...! అసలు సుజాతతో నా పునః పరిచయం యెంత విచిత్రంగా జరిగింది... నేనూ తనూ టెన్త్ క్లాస్ వరకూ కలిసి ఓ స్కూల్లోనే మా వూళ్లో చదువుకున్నాం. ఆ యేడు వాళ్ల నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయి వాళ్లు హైద్రాబాద్ వెళ్లిపోయారు. దాదాపుగా మర్చిపోయిన నేను అనుకోకుండా అగ్రికల్చర్ యూనివర్సిటీకి హైద్రాబాద్ ఇంటర్‌వ్యూకై వెళ్లటం అక్కడే సుజాతను కలుసుకోవటం తటస్థించింది. అక్కడ ఉద్యోగం చేస్తోందట తను ... ఎనిమిదేళ్ల తర్వాత మా పరిచయం స్నేహానికీ, స్నేహం అనుబంధానికీ దారి తీశాయి. 'పెళ్లి చేసేసుకుందామ'ని కూడా నిశ్చయించేసుకున్నాం ఇద్దరం. నాకు ఉద్యోగం వచ్చేదాకా ఆగుదామనీ ... ఈలోపల పెద్దవాళ్లతో మాట్లాడేద్దామనీ చెప్పి వచ్చేశాను నేను. నేను వచ్చి నెలయింది ... యింతవరకూ రెండు వుత్తరాలు వ్రాశాను...ఒక్కదానికీ జవాబు వ్రాస్తేనా... ఏవన్నా అంటే 'బిజీగావున్నాను మధూ' అంటుంది. మరీ యింత తీరికలేని వుద్యోగమా? కనీసం ఈరోజు అయినా సుజాత దగ్గర్నుంచి ఉత్తరం వస్తే ఎంత బాగుండును...! సుజాతను తల్చుకొని నా ఒళ్లు అదోలా పులకించింది...!

మేం పెళ్లి చేసుకుందామని ఒక నిర్ణయాని



కొచ్చిన తర్వాత వాళ్ల నాన్నగారికి ఓ వుత్తరం వ్రాశాము. రెండేళ్లయి ఆయన మద్రాస్ ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లిపోయారుట. సుజాత, వాళ్ల అన్నయ్య, చిన్న చెల్లెళ్ల మాత్రం హైద్రాబాద్‌లోనే వుంటువ్నారు వాళ్ల మామయ్యగారి దగ్గర. అసలు సుజాత వ్రాయమంటేనే వాళ్ల నాన్నగారికి వ్రాశాను. అదృష్టవశాత్తూ మా కులం ఒక్కటే... అయితే వాళ్లకి అభ్యంతరం ఏమున్నా అది నేను నిఃరుద్యోగి నవటమే. ఇప్పుడు పెళ్లి చేసేసుకుంటా ననలేదుగా ... కేవలం ఆయన సమ్మతాన్ని అడిగాను. ఏసంగతీ ఆయనగారు వ్రాస్తేగా ... యిష్టమున్నట్లా ... లేనట్లా ... ఆయన దగ్గర్నుంచి వుత్తరంవస్తే అది నాన్నగారికి చూపించాలి. ఆ సంగతి తెలిసే ఆయన ఇంకా రాయలేదు జవాబు. అసలీ పెద్దవాళ్లకు చిన్నవారి ఆత్రుత అర్థం అయితేకదా ... బహుశ ఈరోజు ఆయన లెటర్ వస్తుందేమో !

"నాన్నగారికి యిష్టంలేకపోతే మన పెళ్లి కష్టం మధూ!" అని అంటుంది సుజాత.

"శ్రీనివాసా ... వాళ్ల నాన్నగారి మనస్సులో ఒక్కసారి నువ్వు దూరి ... ఆయనచేత అవునని పించెయ్యి ... నీ కొండకొస్తాం – సుజాతా నేనూ" అని మ్రొక్కుకొన్నానుకూడా !

"మధు బాబూ..." అన్న పిలుపుతో నా ఆలోచనలకు ఆనకట్ట పడింది.

"ఆఁ ... " అని యిటు తిరిగాను ... ముసి ముసి నవ్వులు నవ్వుతూ అప్పలస్వామి ...! 'ఏమిట్రా...' అడిగేను ...

"టీ తాగుతాను బాబూ..." నసిగేడు.

"వీధిలోకి రా భయం. మొదలౌతుంది నీ బేరం" విసుక్కుంటూ ఓ పదిపైసలు వాడి మొఖాన్న కొట్టాను.

# ఎదురుచూడని ఉత్తరం

ఏడీ యీ రాములు ...? కొంపదీసి వెళ్లిపోయాడా ఏం...ఆలోచనల్లో పడి నేను గమనించనే లేదు ... ఈ వీధికి రోజూ వచ్చే పోస్ట్‌మేన్ ఒక్కడే మనీ ఆర్డర్లకీ, రిజిష్టర్డ్ లెటర్స్‌కీ! అన్నింటికీ ఒక్కడే. అతను ఒక్కో యింట్లో కనీసం పది నిముషాలయినా కాపురం పెట్టేస్తాడు. మనీ ఆర్డర్ అయితే మరి చెప్పక్కర్లేదు ... ఓ అర్ధ రూపాయి అయినా కమీషన్ కొట్టందే వదలడు. నాన్నగారి పెన్షన్ వచ్చిన రోజునయితే అరగంటసేపు ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పి ఓ రూపాయి చక్కా పట్టుకుపోతాడు. ఆ వుద్యోగమే బాగుంది ... పోన్లే పాపం ... అన్నట్లు నేనూ సుజాతకూడా ఉద్యోగం చేస్తే ఏదో వేణ్ణీళ్లకు చన్నీళ్ల ...!

ఆ సందులోంచి డాక్టర్‌గారి అబ్బాయి వస్తున్నాడు. వాణ్ణి అడిగాను. 'ఏం బాబూ పోస్ట్‌మేన్ వున్నాడా వెళ్లిపోయేడా ?"

"ఉన్నాడండీ ... ఆ సుబ్బారాయుడుగారింట్లో వున్నట్టున్నాడు..."

ఈ సుబ్బారాయుడొకడు ... రోజూ పోస్ట్‌మేన్‌తో ఓ అరగంట లోకాభిరామాయణం చర్చించందే ఆయనకి తిన్నది అరగదు. వాళ్ల డ్యూటీ అవర్స్‌లో వాళ్లని డిస్టర్బ్ చెయ్యకూడదు ... ముఖ్యంగా పోస్టల్‌వాళ్లనీ, రైల్వేవాళ్లనీ...పబ్లిక్‌కి ఎంత నష్టం! ఆయనకి బహుశా ఇవ్వాళ మనియార్డర్ వచ్చివుండాలి ...!

నా యిరవైనాలుగేళ్ల జీవితంలో యింతవరకూ ఒక మనియార్డర్ అందుకున్నపాపాన పోలేదు. అయినా నాకెవరు పంపిస్తారు కనుక, నాన్నగారు ఎప్పుడూ నాతోనే వుండె...! ఎప్పుడైనా తలక్రిందులై నాల్గు రచనలు చేసి పత్రికలకు పంపిస్తే అవి తిరుగు టపాలో వచ్చేస్తాయి. అప్పుడు ఈ పోస్టుమేన్ లేట్ చెయ్యడు! అసలీ పాత రచయితలు బాగా ఎస్టాబ్లిష్ అయిపోయి క్రొత్తవాళ్లకు ఛాన్స్ యివ్వరుకాబోలు. పత్రికల వాళ్లూ అంతే ... కాకపోతే నా రచనలకేం...నాకు బాగానే వుంటాయి.

"వాస్తవికతకు సెంట్‌పర్సెంట్ దగ్గరగా వుంటాయిరా" అంటాడు రోజుకి రెండు కాఫీలు దక్షిణగా పుచ్చుకొని నా రచనల్ని ఇంట్రెస్టు తెచ్చి పెట్టుకొని వినే నా ఏకైక శ్రోత బ్రహ్మానందం! అయినా ఏదో ఓ రోజున ఈ ఆంధ్ర పాఠకలోకం నా శక్తిని గుర్తించకపోతుందా! యింతకీ రెణ్ణెల్ల క్రితం పంపిన నా కథ ఇంతవరకూ తిరిగిరాలేదు. ఏమో ... ప్రచురణకి స్వీకరించారో ఏమో ... ఇవ్వాళ ఆ ఎడిటర్ దగ్గర్నుంచి వుత్తరం రావాలట. బ్రహ్మానందానికి డబుల్‌స్ట్రాంగ్ బ్రూ కాఫీ ఇప్పించేస్తాను ...!

ఆలోచన్ల ఉరవడిలో కొట్టుకుపోతున్న నాకు ప్రక్కింట్లోంచి బైటపడ్డ రాముల్ని చూడగానే బ్లడ్‌ప్రెషర్ ఎక్కువయింది.

"అమ్మయ్య... యెంతసేపు వెయిట్ చేయించావోయ్!" మెట్లు దిగి రాముల్ని ఆహ్వానిద్దామని వెళ్లబోయాను.

"రాములూ... ఇదిగో నాయనా... యీ వుత్తరం కాస్త డబ్బాలో వేసిపెడ్దూ..." ఎదురింటి బామ్మగారు నాకంటే ముందు.

మరో రెండు నిముషాలు ఆలస్యం... బుర్ర వేడెక్కిపోయింది. అప్పుడే దాదాపు ఇరవై నిముషాలయి నిల్చున్నాను యెండలో...

"మధూ... ఒరే... మధూ" ఇంట్లోంచి తాతయ్య కేక.

"ఆఁ... వస్తున్నాన్ తాతయ్యా..." నా జవాబు. ఈ ముసలాళ్లకింకో పని వుండదు. యింట్లో వున్న జనమంతా వీళ్ల ఎదుటే వుండకపోతే వీళ్లకి ఒక క్షణం తోచదు.

ఎదురింట్లోంచి వచ్చిన రాములు నన్ను చూసి పలకరింపుగా నవ్వాడు... అంటే వుత్తరా లున్నాయన్న మాటే...! గుండె వేగం హెచ్చవగా... ముఖాన్న బలవంతంగా చిరునవ్వు పులుముకొని... "యేం రాములూ... ఉత్తరాలేమన్నా...?" వణుకుతుంది నా గొంతు...

రాములు తన కట్ట విప్పి పది ఉత్తరాలు ఇటూ అటూ చేసి ఓ మనీ ఆర్డర్ కౌంటర్‌ఫాయిల్ – యెప్పుడో తిరుపతికి నేను పంపిన రూపాయి పన్నెండు పైసల తిరుగు రశీదు అందించాడు...

"యింకేమన్నా..." నసిగాను.

"మరేం లేవు బాబూ..." వస్తాను అంటూ రాములు వెనుదిరిగాడు.

"ఒరే మధూ... నిన్నేరా..." మళ్లీ తాతయ్య కేక.

జవాబు చెప్పేందుకు నాకు ఓపిక లేకపోయింది. యెండ ప్రభావం అప్పుడే తెలిసింది...!!

## * ఇంటింటి చిట్కాలు *

మామూలుగా పనికిరావు అనుకొని ఎన్నో వస్తువులను పారవేస్తుంటాం. కాని వాటినికూడా వాడుకోవచ్చును.

★ బత్తాయిపండ్ల తొక్కలను సాధారణంగా మనం పారవేస్తుంటాం. కాని ఆ తొక్కలను మెత్తగా పొడిచేసి ఒక చిన్న డబ్బాలో నిలువ చేసుకొని స్నానం చేసేటప్పుడు కొద్ది గడ్డపెరుగుతో ఒక చెంచా పొడి కలిపి ముఖానికి మర్దనచేస్తే ముఖమునకు మృదుత్వాన్నిస్తుంది!

★ పెద్దసైజు ఖాళీ పౌడరు డబ్బాలు సహజంగా పారవేయటమో లేక పిల్లలు ఆడుకోవటమో జరుగుతూంటుంది. అలా వాటిని వదిలివేయక ఆ డబ్బాలకు ఆకర్షణీయమైన రంగులతో పెయింట్ చేసి చక్కని "ఫ్లవర్‌వాజ్"గా ఉపయోగించుకొనవచ్చును.

★ ఎండిపోయిన పువ్వులను చిమ్మి అవతల పారేస్తాం. కాని మంచి సువాసన గల పూలను ఎండిన తర్వాత మెత్తగా పొడిచేసి సున్నిపిండిలో కలిపి నిల్వ చేసికొని స్నానానికి వాడితే ఎంతో సువాసనా భరితంగా వుండగలదు.

★ కొన్ని ఇండ్లలో పెద్ద రేకుపెట్టెలు లేక చెక్కపెట్టెలు నిరుపయోగంగా వదిలివేసి వుంటారు. వాటిమీద చక్కని డిజైన్లు గల బెడ్‌షీట్లను వేసి ప్రక్కల చక్కగా పిన్‌చేసి వాటికి అనువైన రంగు గల కుషన్స్ వేస్తే చక్కని సోఫాసెట్స్ తయారు అవుతాయి!

సేకరణ : యం. ఆర్. శేఖర్